


డీసీసీ పీఠం దక్కేదెవరికో..?

- ఆశావహుల్లో వీడని ఉత్కంఠ
- ఏఐసీసీ పరిశీలకుడికి 36 దరఖాస్తులు
- జిల్లా నుంచి పరిశీలనలో మూడు పేర్లు
- పంచాయతీ, పరిషత్ ఎన్నికలకు ముందే ప్రకటించే అవకాశం

జగిత్యాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ, పరిషత్ ఎన్నికలకు ప్రభుత్వం సమాయత్తం అవుతున్న నేపథ్యంలో డీసీసీ అధ్యక్ష పీఠం ఎవరికి దక్కుతుందోనన్న చర్చ కాంగ్రెస్‌లో జోరుగా సాగుతోంది. అర్థంతరంగా వాయిదా పడిన డీసీసీ అధ్యక్షుల ఎంపిక ప్రక్రియపై టీపీసీసీ తాజాగా దృష్టి సారించింది. సాధ్యమైనంత తొందరలో డీసీసీ రథసారథులను ప్రకటించేందుకు కసరత్తు చేస్తోంది. ఈ మేరకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డితో పాటు జిల్లాకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీలు, సీనియర్ల నుంచి తుది అభిప్రాయ సేకరణ చేస్తున్నట్లు పార్టీ వర్గాలు అంటున్నాయి.

వాస్తవానికి ఈనెల తొలివారంలోనే ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు అక్టోబరులో కార్యాచరణ చేపట్టారు. గత నెలలో ఏఐసీసీ పరిశీలకులు, తమిళనాడుకు చెందిన మాజీ ఎంపీ డాక్టర్ జయకుమార్, టీపీసీసీ పరిశీలకులు కేతూరి వెంకటేశ్, మహ్మద్ ఖాజా ఫకీరోద్దీన్‌లు జిల్లాలో పర్యటించారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాలులో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఆశావహుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. డీసీసీ పీఠం కోసం పదుల సంఖ్యలో నేతలు పోటీ పడ్డారు. ఏఐసీసీ మార్గదర్శకాల మేరకు జిల్లా నుంచి నాలుగు పేర్లను తీసుకొని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, సీఎం రేవంత్ రెడ్డిలకు అందజేశారు. జగిత్యాల జిల్లా నుంచి బలమైన ముగ్గురు పేర్లను మాత్రమే ఏఐసీసీ, టీపీసీసీ పరిశీలకులు అధిష్టానానికి అందించినట్లు పార్టీలో ప్రచారం జరుగుతోంది.

జూబ్లిహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో ఆలస్యం

ఇదే సమయంలో స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ రావడం, హైకోర్టు స్టేతో రద్దు కావడం, జూబ్లీ హిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక కారణంగా డీసీసీ ఎంపిక ప్రక్రియ అర్థాంతరంగా ఆగిపోయింది. ప్రస్తుతం జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక ముగియడం, కాంగ్రెస్ పార్టీ విజయాన్ని సొంతం చేసుకొని తన ఖాతాలో ఇంకో ఎమ్మెల్యే పదవిని వేసుకోవడంతో డీసీసీ ఆశావహుల్లో ఆసక్తి నెలకొంది. రెండు రోజుల క్రితం జరిగిన కేబినెట్ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సైతం సిద్ధం కావాలని నిర్ణయం తీసుకున్నారు. కాంగ్రెస్ పార్టీకి క్షేత్ర స్థాయిలో సరియైన నాయకత్వం ఉండి, ఆశించిన ఫలితాలు రావాలంటే డీసీసీ అధ్యక్ష పదవులను భర్తీ చేయాలని అధిష్టానం భావిస్తోంది. దీంతో డీసీసీ అధ్యక్షుడి ఎంపికపై మరోమారు కసరత్తు చేస్తున్నట్లు పార్టీ వర్గాలు అంటున్నాయి.

ఎంపికపై టీపీసీసీ తుది అభిప్రాయ సేకరణ

డీసీసీ అధ్యక్ష పీఠం కొరకు దరఖాస్తులు చేసుకున్న నేతల్లో ఎదురుచూపులు తప్పడం లేదు. ఎప్పుడెప్పుడు అధిష్టానం డీసీసీ అధ్యక్ష పదవి భర్తీ చేస్తుందా అన్న ఆశతో ఎదురుచూస్తున్నారు. దాదాపు పదేళ్లుగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేకపోవడం, అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో సంస్థాగతంగా బలోపేతం కావడానికి చర్యలు తీసుకుంటోంది. సంస్థాగతంగా ప్రాధాన్యతనిస్తామని అధిష్టానం చెబుతుండడంతో డీసీసీ అధ్యక్షుడు జిల్లా స్థాయిలో కీలకం కానున్నట్లు ప్రచారం జరుగుతోంది. పార్టీ మిగతా 8వ పేజీలో..

పోటాపోటీగా దరఖాస్తులు..

జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో ఏఐసీసీ పరిశీలకుడు డాక్టర్ జయకుమార్ గత నెల 17వ తేదీన జిల్లా స్థాయిలో ప్రత్యేక సమావేశం నిర్వహించి 36 మంది ఆశావహుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. డీసీసీ అధ్యక్ష పదవికి కాంగ్రెస్ నాయకులు జువ్వాడి నర్సింగరావు, కల్వకుంట్ల సుజిత్‌రావు, గాజెంగి నందయ్య, వాకిడి సత్యంరెడ్డి, కొమిరెడ్డి విజయ్ ఆజాద్, కొమిరెడ్డి కరం, కొమిరెడ్డి లింగారెడ్డి, షేర్ నర్సారెడ్డి, గుంటి జగదీశ్వర్, ఎండీ షాకీర్ సిద్ధిఖీ, అబ్దుల్ హఫీజ్, చెదలు సత్యనారాయణ, అల్లె పాండురంగ, పట్నం శేఖర్, గడ్డం రాజేశం, ముస్కు నిశాంత్ రెడ్డి, కూన భార్గవ్, పోగుల శ్రీనివాస్, తొట్ల అంజయ్య, నారాయణ, లక్ష్మీ నారాయణ, సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, అందె మారుతి, సంగన భట్ల దినేష్, వేముల సుభాష్, పుప్పాల వనిత, రాజేశం, శైలేందర్, పెద్దిరెడ్డి రహీం దర్‌రెడ్డి, అందె లలిత, రాజేశ్వరీ, మమత, బండ భాస్కర్ రెడ్డి, కూన రాకేశ్, మదన్ కుమార్, కృష్ణలు దరఖాస్తులు సమర్పించారు.

పోస్టర్ ఆవిష్కరణ

పెగడపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండల కేంద్రంలో మంగళవారం మాల మహానాడు మండల శాఖ ఆధ్వర్యంలో హలో మాల చలో ఢిల్లీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. రాజ్యాంగ హక్కుల సాధన కోసం జంతర్ మంతర్ వద్ద ఈనెల 26న నిర్వహించనున్న ధర్నా కార్యక్రమానికి సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రతి గ్రామం నుండి మాలమహానాడు సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య, జిల్లా అధ్యక్షులు పొనగంటి రాజయ్య, రాష్ట్ర నాయకులు బత్తుల ప్రదీప్ మండల అధ్యక్షులు కామాద్రి అరుణ్, నల్లాల చందు, మేరుగు మాణిక్యం, లక్ష్మణ్, వెంకట్రాజం, నర్సయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి'

జగిత్యాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా వడ్డీ వ్యాపారం చేస్తున్న వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి జిల్లా ఎస్పీకి మంగళవారం లేఖ రాశారు. జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు చిరు వ్యాపారాలు చేసుకునేందుకు ఆర్థిక ఇబ్బం దులతో వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తు న్నారన్నారు. అధిక వడ్డీ వసూలు చేసే వారి ఆగడాలు భరించలేక చిరు వ్యాపారులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారని, ఇలాంటి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలి

మల్లాపూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వరి కొనుగోలు ప్రక్రియలో నిర్వాహకులు రైతులకు ఎలాంటి ఇబ్బంది కలిగించ కూడదని మల్లాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుష్పలత అన్నారు. మంగళవారం సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోళ్లను పాలక వర్గం సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిర్వాహకులకు, రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ సీసీ లక్ష్మణ్, మాజీ సర్పంచ్ జలపతిరెడ్డి, నాయకులు శేఖర్, శ్రీనివాస్, మహిళలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి

జగిత్యాలరూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజాభద్రత, శాంతి భద్రతల పరిరక్షణలో చురుగ్గా పని చేయాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ నూతనంగా నియామకమైన జగిత్యాల రూరల్ ఎస్సై ఉమాసాగర్‌కు సూచించారు. జగిత్యాల రూరల్ ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన ఉమాసాగర్ మంగళవారం ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎస్సైకి శుభాకాంక్షలు తెలిపారు.

సౌదీ యాత్రికుల మృతికి సంతాపం

కొడిమ్యాల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సౌదీ అరేబియాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో పలువురు తెలంగాణ వాసులు మృతి చెందటం పట్ల మాజీ కోఆప్షన్ సభ్యుడు చాంద్ పాషా సంతాపం వ్యక్తం చేశారు. మాజీ కో ఆప్షన్ సభ్యుడు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ మక్కా నుంచి మదీనా వెళ్తున్న బస్సు అగ్నిప్రమాదానికి గురై 42మంది ప్రాణాలు కోల్పోవటం పట్ల విచారం వ్యక్తం చేశారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు చేపట్టాలి


కొనుగోలు కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాలరూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జగిత్యాల రూరల్ మండలంలోని నర్సింగాపూర్ అంతర్గాం, తాటిపల్లి, మోరపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం స్వీకరణ పరిస్థితిని తూకం విధానాన్ని, 17తేమశాతం నిర్వహణను, కేంద్రాల వద్దవసతులను సమీక్షించారు.

రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా, వేగంగా కొనుగోలు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే కొనుగోలు కేంద్రాలకు వచ్చే వరి ధాన్యంపై ప్రభుత్వ నిబంధనల మేరకు తేమశాతం తప్పనిసరిగా పరిశీలించి నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా మాత్రమే కొనుగోలు చేయాలని కలెక్టర్ సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వాహనాల ద్వారా తక్షణమే రైస్‌మిల్లులకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. కేటాయించిన క్లస్టర్ అధికారులు , రైతులకు అవసరమైన సేవలు, త్రాగునీరు బరువు యంత్రాల నిర్వహణ, ధాన్యం కొనుగోలు వంటి అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో డీఆర్‌డీఓ రఘువరణ్, డీఎస్‌ఓ జితేందర్‌రెడ్డి, తహసీల్దార్ వరందన్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

మల్లన్న జాతర ఏర్పాట్ల పై సమీక్ష

గొల్లపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం మల్లన్నపేటలో నిర్వహించే దొంగ మల్లన్న జాతర ఏర్పాట్ల పై జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ మంగళవారం గొల్లపల్లి పోలీస్ స్టేషన్‌లో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా జాతరకు వచ్చే భక్తుల సంఖ్యకు అనుగుణంగా భద్రతపై దృష్టి పెట్టాలని ధర్మపురి సీఐ రాం నరసింహారెడ్డి, గొల్లపెల్లి ఎస్సైకి సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని డీఎస్పీ ఆదేశించారు.

అత్యవసర కిట్లు అందుబాటులో ఉంచాలి

మల్యాల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): 108 అంబులెన్స్ వాహనంలో అత్యవసర కిట్లు అందుబాటులో ఉంచాలని జిల్లా మేనేజర్ యశోద అయిలయ్య అంబులెన్స్ సిబ్బందికి సూచించారు. మల్యాలలోని 108 వాహనాన్ని మంగళవారం పరిశీలించారు. రికార్డులు పరిశీలించారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి
అదనపు కలెక్టర్ రాజాగౌడ్ 8లో..

వైభవంగా గోదావరి హారతి
ప్రత్యేక పూజలో పాల్గొన్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ 7లో..

ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలి
ఉద్యాన విస్తరణ అధికారి అనిల్ 8లో..

జిల్లాలో చలి పంజా

గోవిందారంలో అత్యల్పంగా 8.6 డిగ్రీలు నమోదు

జగిత్యాల అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోజురోజుకూ చలి తీవ్రత పెరుగుతోంది. జిల్లాలో అత్యల్పంగా భీమారం మండలం గోవిందారంలో 8.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కథలాపూర్‌లో 9.4, భీమారం మండలం మన్నెగూడెంలో 7, కొడిమ్యాల మండలం తిర్మలాపూర్‌లో 9.8, గొల్లపెల్లిలో 9.9, కొడిమ్యాల మండలం పూడూర్, మల్లాపూర్‌లలో 10, మెట్‌పెల్లి మండలం జగ్గాసాగర్, పెగడపెల్లిలో 10.2, కోరుట్ల మండలం అయిలాపూర్‌లో 10.3, మల్లాపూర్ మండలం రాఘవపేటలో 10.4, మద్దుట్లలో, ధర్మపురి మండలం నేరెళ్ళ, మేడిపల్లి మండలంలో 10.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. జగిత్యాల రూరల్ మండలం పొలాసలో 10.7, రాయికల్ మండలం అల్లీపూర్, బీర్‌పూర్ మండలం కొల్వాయిలో 10.8, కోరుట్ల, రాయికల్‌లో 10.9, జగిత్యాలలో 11.1, మెట్‌పెల్లి, సారంగాపూర్‌లలో 11.2, ధర్మపురి మండలం బుద్దేశ్‌పల్లిలో 11.4, ఇబ్రహీం పట్నం మండలం గోదూర్‌లో 11.7, వెల్గటూర్‌లో 12.1, ధర్మపురి మండలం జైనలో 12.7, ఎండపెల్లి మండలం మారెడుపల్లిలో 12.8, ఎండపెల్లి మండలం గుల్లపేట, ఎండపెల్లి, బుగ్గారం మండలం సిరికొండలో 13.9, ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చిన్న పిల్లలు, వృద్ధులు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లకుండా చూసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

డ్రగ్స్ రహిత సమాజానికి అందరూ పాటుపడాలి

అదనపు కలెక్టర్ రాజాగౌడ్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాజాగౌడ్

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజాగౌడ్ అన్నారు. సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నషాముక్త్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా అధికారులు, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది, విద్యార్థులచే మంగళవారం సమీకృత కలెక్టర్ కార్యాలయ సముదాయంలో మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ మహమ్మారి జీవితాలను నాశనం చేస్తుందని తెలిపారు. చెడు వ్యసనాలకు గురైన వ్యక్తి బయటకు రాలేడని, మానసికంగా, ఆరోగ్యంగా దెబ్బతిని క్షోభపడతారన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా విద్యార్థులు చదువులపై దృష్టి సారించాలన్నారు. విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కన్నం హరిణి, డీడబ్ల్యూవో డాక్టర్ భోనగిరి నరేష్, డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, సాంఘిక సంక్షేమ అధికారి రాజ్‌కుమార్, బీసీ వెల్ఫేర్ అధికారిణి సునీత పాల్గొన్నారు.

ప్రజల్లో చైతన్యం కోసమే కళా ప్రదర్శనలు

-ఎస్పీ అశోక్‌కుమార్


మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాల టౌన్, నవంబర్ 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజల్లో సామాజిక అంశాలపై చైతన్యం పెంపొందించేందుకు పోలీసులు కళా ప్రదర్శనలు నిర్వహిస్తున్నారని ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. పోలీస్ కళాబృందం జిల్లా వ్యాప్తంగా ప్రజలకు చేరువ అవుతూ, మానవ విలువలు, అభివృద్ధి, మూఢ విశ్వాసాలు, మత్తు నిర్మూలన, చట్టాలపై అవగాహన, సైబర్ భద్రత, మహిళా భద్రత, ట్రాఫిక్ నియమాలు వంటి అంశాలపై పాటలు, నృత్యాల రూపంలో సందేశాలను అందజేస్తున్నారని తెలిపారు. పోలీసు కళా బృందం ద్వారా గడిచిన 10 నెలల కాలంలో 150 అవగాహన సదస్సులు నిర్వహించడం జరిగిందని అన్నారు. గ్రామాలు మండలాలు, జిల్లా కేంద్రాల్లో ప్రతీ రోజు నిర్వహించే అవగాహన కార్యక్రమాల్లో పోలీసు కళా బృందం తమ ప్రదర్శనల ద్వారా ప్రజల నుంచి స్పందన వస్తుందన్నారు. ఈ విస్తృత అవగాహన కార్యక్రమాల ఫలితంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆలోచన విధానంతో సామాజిక వ్యవహారాల్లో స్పష్టమైన మార్పు కనిపిస్తోందని మూఢ విశ్వాసాలు తగ్గుముఖం పడుతున్నాయని ఎస్పీ పేర్కొన్నారు.

బాలికలు క్రీడల్లో రాణించాలి

కోరుట్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): బాలికలు క్రీడలలో రాణించి ఉత్తమ స్థానంలో నిలవాలని జిల్లా క్రీడ అభివృద్ధి అధికారి కోరుకంటి రవిందర్ అన్నారు. మంగళవారం కోరుట్ల పట్టణంలోని బాలికల జిల్లా స్థాయి అస్మిత లీగ్ అథ్లెటిక్ పోటీలను విజయవంతం చేయాలని వివిధ పాఠశాల బాలికలతో ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడ అభివృద్ధి జిల్లా అధికారి రవిందర్ మాట్లాడారు. ఈనెల 24వ తేదీన మెట్‌పల్లి పట్టణంలోని మినీ స్టేడియంలో భారత ప్రభుత్వం అథ్లెటిక్స్ ఫెడరేషన్ అఫ్ ఇండియా ఆద్వర్యంలో నిర్వహిస్తున్న అథ్లెటిక్స్ పోటీలలో బాలికలు అధిక సంఖ్యంలో పాల్గొన్ని విజయవంతం చేయాలని కోరారు. బాలికలు సత్తా చాటుకొని రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక కావాలని కోరారు. కార్యక్రమంలో వివిధ పాఠశాల బాలికలు, ప్రిన్సిపాల్స్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్


మహిలలకు చెక్కు అందిస్తున్న మంత్రి అడ్లూరి, ఎమ్మెల్యే సంజయ్, కలెక్టర్

జగిత్యాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మహిళల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్‌లో స్వయం సహాయక, మహిళా సంఘాలకు మెగా రుణమేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ జిల్లాలో 15,244 సంఘాల్లో 1,77,054మంది సభ్యులు ఉన్నారని, వారందరికీ వడ్డీలేని రుణాలను అందిస్తూ ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. కలెక్టర్ సత్య ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం అందించే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ మాట్లాడుతూ మహిళా సంక్షేమం కోసం ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. అనంతరం జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులకు యూనియన్ బ్యాంకు ద్వారా రూ. 36కోట్ల 12లక్షల, 69వేల విలువగల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు బీఎస్ లత, రాజాగౌడ్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కన్నం హర్షిణి, డీఆర్‌డీఎ పీడీ రఘువరణ్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంకుమార్ ఉన్నారు. అంతకుముందు రచయిత అందెశ్రీ మృతి పట్ల మౌనం పాటించారు.

గ్రంథాలయ వారోత్సవాలు

జగిత్యాల అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాలలో ఐదవ రోజైన మంగళవారం విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొని చదువు, జ్ఞానం, సాక్షరత పై పాటలు పాడారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకులు శకుంతల, కవిత, తరంగిణి, జమున, చందన, అనిత, సరోజ తదితరులు పాల్గొన్నారు.

●కథలాపూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులచే పుస్తక పఠనం చేయించారు. ఈ నెల 14 నుంచి 20 దాకా వారోత్సవాలు కొనసాగుతున్న నేపథ్యంలో చిత్ర లేఖనం, వ్యాస రచన, క్విజ్ వంటి పోటీలు విద్యార్థులకు నిర్వహించనున్నామన్నారు. గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలని, పుస్తకాలు మంచి నేస్తాలని గ్రంథ పాలకుడు తోపారపు రమేశ్ పేర్కొన్నారు. పుస్తకాలు విజ్ఞానం పెంచడంతో పాటు వ్యక్తిత్వ వికాసం పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అచ్యుత్‌రాజ్, అధ్యాపకులు ఉన్నారు.

అటవీ సంపదను పరిరక్షించాలి


నర్సరీని పరిశీలిస్తున్న అటవీ అధికారులు

ఇబ్రహీంపట్నం, నవంబరు18(ఆంధ్రజ్యోతి): అటవీ సంపదను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకోవాలని నిజామాబాద్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ గంగాధర్ అన్నారు. మండలంలోని గోధుర్, తిమ్మాపూర్ గ్రామాల్లోని నర్సరీలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా గోధుర్ గ్రామ నర్సరీలోని మొక్కలను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం తిమ్మాపూర్ గ్రామ గనే గుట్టవద్ద గల ఏడు ఎకరాల్లో నాటిన కానుగ, ఉసిరి తదితర మొక్కలను పరిశీలించి, సిబ్బందిని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ అధికారి చైతన్యశ్రీ, బీట్ అధికారి మధుసూదన్, అటవీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయించాలి

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు18 (ఆంధ్రజ్యోతి):సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిరుక్కోవెల శ్యాంసుందర్ డిమాండ్ చేశారు. జగిత్యాల అర్బన్ మండలంలో తెలంగాణ రాష్ట్ర ఐక్యఉపాధ్యాయ సంఘం (టీఎస్‌యూటీఎఫ్) ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యాంసుందర్ మాట్లాడుతూ ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. అనేక సంవత్సరాల నుంచి విధులు నిర్వహిస్తూ బోధనలో నిమగ్నమైన వారిని ఆందోళనకు గురిచేస్తూ ఉద్యోగ చరమాంకంలో అర్హత పరీక్షతో భయభ్రాంతులకు గురిచేయడం అన్యాయం అన్నారు. అసంబద్ధమైన పాత ఉపాధ్యాయుల సర్దుబాటు విధానాన్ని పక్కనబెట్టి, నేటి సమాజ అవసరాలకు అనుగుణంగా సర్దుబాటు చేయాలన్నారు. పాఠశాలలకు పదిమంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు, తర్వాత తరగతి గదికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చూడాలన్నారు. జీవో 25ను సవరించి ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సర్దుబాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్, కోశాధికారి ఒజ్జ శ్రీనివాస్, మండల అధ్యక్షుడు బల్ల సత్యనారాయణ తదితరులున్నారు.

పంచాయతీ పైపులు మాయం

- పోలీసులకు ఫిర్యాదు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), నవంబరు18(ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం వన్‌పల్లి గ్రామ పంచాయతీకి సంబంధించిన తాగు నీటి పైపులు మాయమయ్యాయి. సుమారు 30 పైపులు కనిపించకుండాపోయాయి. విషయం తెలుసుకున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మంగళవారం ఆరా తీశారు. మండలంలోని గర్జనపల్లికి చెందిన రైతు బంతిలాల్ వ్యవసాయ పొలంలో పైపులు వేస్తుండడాన్ని గమనించారు. ఎక్కడి నుంచి తీసుకువచ్చారని ప్రశ్నించారు. సదరు రైతు నుంచి పైపులను స్వాధీనపర్చుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అనిల్ వివరించారు. గ్రామంలోని ఓ పార్టీ నాయకుడు పంచాయతీ పైపులను ఒక్కో దానికి రూ.వేయి చొప్పున సుమారు 90 పైపులను విక్రయించారని విచారణలో తేలినట్లు సమాచారం.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం

ఎల్లారెడ్డిపేట, నవంబరు18(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో అద్దెకు ఉంటున్న మదురాల నర్సయ్య ఇల్లు ప్రమాదవశాత్తు మంగళవారం దగ్ధమైంది. తాళం వేసిన ఇంటి గదుల నుంచి మంటలు వ్యాపించడంతో చుట్టు పక్కల వారు ఆయనకు సమాచారం అందించారు. అక్కడి చేరుకునే సరికి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. చుట్టుపక్కల వారు ఆర్పేందుకు యత్నించారు. ఇంటిలోని విలువైన పత్రాలు, వస్తువులు కాలిపోయాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు చేరుకుని స్థానికుల సహాయంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఘటనలో సుమారు రూ.2లక్షల నష్టం వాట్లిందని బాధితులు పేర్కొన్నారు.

15 మందికి జరిమానా

ఇల్లంతకుంట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలలో మద్యంసేవించి వాహనాలు నడిపిన 15మందికి జరిమానా విధించినట్లు ఎస్సై సిరిసిల్ల అశోక్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం కోర్టు కానిస్టేబుల్స్ తిరుపతి, జీవన్ మద్యంసేవించి వాహనాలు నడిపిన వారిని మంగళవారం కోర్టులో హాజరుపర్చారు. జిల్లా సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ జయశ్రీ 12మందికి రూ.1000, మరో ముగ్గురికి రూ 5వేల చొప్పున జరిమానా విధించారు.

గోదావరిలో దూకి యువకుడి ఆత్మహత్య

ధర్మపురి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి గోదావరి నదిలో దూకి పంపరి అజయ్ (34) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. హుజూరాబాద్‌కు చెందిన అజయ్ తల్లి ఇటీవల మృతిచెందగా అజయ్ ఇంటిలో ఒంటరిగా ఉంటున్నాడు. ఈ నెల 11న తల్లి పెద్ద ఖర్మ ఉండగా 9న అజయ్ ధర్మపురికి వచ్చాడు. అదే రోజు గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. రాయపట్నం వద్ద గోదావరి నదిలో మంగళవారం మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో కనిపించింది. అజయ్ సోదరి రమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు.

పీజీ రెండో సెమిస్టర్ ఫలితాలు విడుదల




ఫలితాలు విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ వరలక్ష్మి

గణేశ్‌నగర్, నవంబరు18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కరీంనగర్ ఆగస్టులో నిర్వహించిన పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల రెండో సెమిస్టర్ ఫలితాలను ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి.వరలక్ష్మి మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ జి. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. కళాశాలలో ఉన్న ఏడు పీజీ కోర్సుల్లో 95 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఫలితాలను కళాశాల వెబ్‌సైట్‌లో విద్యార్థినులకు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల పరీక్షల అదనపు నియంత్రణాధికారులు పాల్గొన్నారు.

మాయమైపోతున్న మానవత్వం

- చిన్నచిన్న కారణాలతో కుటుంబసభ్యుల హత్యలు
- కాలయములుగా మారుతున్న కన్నవారు



కరీంనగర్ క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో నానాటికి పెరిగిపోతున్న నేరాల తీవ్ర తను చూస్తే మనుషుల విపరీతమైన నేర ప్రవర్తనపై అసహ్యం వేస్తున్నది. మనుషుల మధ్య ప్రేమలు, ఆప్యాయతలు, అనురాగాలు మాయమవుతున్నాయి. మనుషులు డబ్బులు, సంపదపై మమ కారాన్ని పెంచుకుంటుండంతో మానవ సంబంధాలు మాయమవుతున్నాయి. భర్తను భార్య హత మార్చడం, భార్యను భర్త హత్య చేయడం, తండ్రిని కొడుకు, కొడుకు, కూతుర్లను తండ్రి చంపడం వంటి ఘటనలు అందరిని కలచి వేస్తున్నాయి. నాగరిక సమాజంలో ఆటవికమైన నేర ఘటనలు చోటు చేసు కోవడం విచారకరం. జిల్లాలో ఇటీవల జరుగుతున్న వరుస సంఘటనలు సర్వత్రా ఆందోళన రేకెత్తిస్తు న్నాయి.

దివ్యాంగులైన పిల్లలను వదిలించుకునేందుకు..

తాజాగా కన్నతండ్రే దివ్యాంగులైన కన్న కూతురిన హత్య చేసి, కొడుకును హత్య చేసేందుకు యత్నించిన ఘటన కరీంనగర్‌లో చోటు చేసుకుంది. కన్న పిల్లలను అల్లారుముద్దుగా చూసుకోవాల్సిన తండ్రే ఆ దివ్యాంగుల పాలిట కాలయముడవ ఇం దారుణం. పోషణ భారమవతున్నదనే కారణంగానే తన కూతురు, కొడుకును కనికరం లేకుండా విషంఇచ్చి హతమార్చే యత్నం చేశాడు. అది విఫలమవటంతో టవల్‌తో గొంతుకు ఉరిబిగించి చంపాలని ప్రయత్నించాడు. కూతురు మరణించింది. కొడుకు కొన ఊపిరితో ఆసుపత్రిలో ప్రాణాలతో పోరాడుతున్నాడు. అనంతరం తండ్రి మల్లేశం ఇంటి నుంచి పరారుకాగా రెండు రోజుల తరువాత త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించారు.

- మరో ఘటనలో 2020 ఫిబ్రవరి 10న కరీంనగర్‌లోని విద్యాగనర్ ప్రాంతంలో ఇంటర్ చదువుతున్న ముత్త రాధిక(17) అనే దివ్యాంగులరాలిని ఆమె కన్న తండ్రి కొమురయ్య కత్తితో గొంతుకోసి దారుణంగా హత్య చేశాడు. ఆపై గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేశారంటూ కన్నీటిపర్యంతమయ్యాడు. సంఘటనా స్థలంలో సీసీ కెమెరాలు, సెల్‌టవర్ డంపును పరిశీలించిన పోలీసులకు అనుమానంవేసి లోతుగా విచారణ జరపగా తండ్రే హత్య చేసినట్లు వెల్లడైంది. నిందితుడు ఘటనస్థలంలో ఎలాంటి ఆధా రాలు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ అప్పటి పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి హైదరాబాద్ నుంచి జర్మన్ సాంకేతిక పరిజ్ఞానంతో కీలక ఆధారాలను సేకరించారు. ఎంత డబ్బు ఖర్చుచేసినా దివ్యాంగురాలి ఆరోగ్యం బాగుపడటంలేదని హత్య చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఈ రెండు ఘటనల్లో తండ్రులైన నిందితులు కన్నకూతుర్లను అల్లారు ముద్దుగా చూసుకోవాల్సిందిపోయి, చిన్నతనం లో గోరుముద్దలు తినిపించిన తండ్రులే అవే చేతులతో కర్కశంగా చంపివేశారు. జిల్లాలో జరిగిన ఈ రెండు ఘటనలు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించాయి.

ఆస్తి తగాదాలతో

జిల్లాలో ఆస్తి తగాదాలతో తండ్రులను కొడుకులు హతమార్చటం, సోదరులు ఒకరిని ఒకరు చంపటం, వివాహేతర సంబంధాలతో భార్య భర్తను, భర్త భార్యను, ప్రియురాలిని హత్య చేసిన ఘటనలు చాలానే జరిగాయి. ఇటీవల కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మహిళ వివాహేతర సంబంధంతో ప్రియుడితో కలిసి మద్యంలో పురుగుమందు తాగించి భర్తను హత్య చేయించింది.అంతకు ముందు భగత్ నగర్‌లో ప్రియురాలిని ప్రియుడు ఇంటికి పిలిచి బండరాయితోబాది హత్య చేశాడు. కొన్నేళ్ల క్రితం భగత్ నగర్ ప్రాంతంలో దంపతుల నిద్రకు ఆటంకం కలిగిస్తూ రాత్రివేళ ఏడుస్తున్నదనే కారణంగా ఏడాది వయస్సున్న చిన్నారిని కన్నతల్లి నీటి సంపులో వేసి చంపింది. విద్యానగర్ ప్రాంతంలో ఆస్తి తగాదాలతో సోదరుడిని అతనిసోదరే రోకలిబండతో బాదిహత్య చేసింది.

వరుస చోరీలతో బెంబేలు

గన్నేరువరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో వరుస దొంగతనాలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. సోమవారం రాత్రి మండల కేంద్రంలో రంగనవేని మల్లయ్యకు చెందిన రెండు దూడలను దొంగలు ఎత్తుకెళ్లారు. వాటి విలువ సుమారు 50 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు. అదే రాత్రి మండల కేంద్రంలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న హనుమాన్ ఆలయంలోని పెద్ద కంచు గంటను దొంగిలించారు. స్థానిక భక్తులు మంగళవారం ఉదయం చోరీకి గురైనట్లు గుర్తించారు. అదే ఆలయంలో గతంలో హుండీని దొంగలు ఎత్తుకెళ్లారు. మూడు రోజుల క్రితం గునుకుల కొండాపూర్‌లో పలువురు రైతులకు చెందిన నాలుగు ఆవులను దొంగలించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం పట్టుకున్నట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. నగునూర్, బొమ్మకల్ లారీ అసోసియేషన్ వద్ద ట్రాక్టర్లను పట్టుకున్నట్లు, డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

గన్నేరువరం : అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను మండలంలోని గుండ్లపల్లి వద్ద పట్టుకున్నట్లు ఎస్సై నరేందర్ రెడ్డి తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం. మంగళవారం మండలంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా గుండ్లపల్లి హనుమాన్ ఆలయం వద్ద ఇసుక లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను తనిఖీ చేసినట్లు చెప్పారు. సరైన పత్రాలు లేకపోవడం, అక్రమంగా ఇసుక తరలిస్తుండడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

- వైద్యుడి నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆందోళన



వేదాన్స్(ఫైల్)

కోరుట్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం వేదాన్స్ (5) అనే బాలుడు మృతి చెందాడు. వైద్యుడి నిర్లక్ష్యంతోనే బాలుడు మృతి చెందాడని ఆరోపిస్తూ ఆసుపత్రిలో కుటుంబసభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయికల్‌కు చెందిన పొలాస విజయ్-నందిత దంపతులు కుమారుడు వేదాన్స్‌తో కలిసి పట్టణంలోని ప్రకాశం రోడ్డులో ఉంటున్నారు. సోమవారం తీవ్ర జ్వరంతో బాధపతుండంగా వేదాన్స్‌ను కోరుట్ల పట్టణంలోని ఓ ప్రైవేట్ చిల్డన్స్ ఆసుప్రతిలో చికిత్స కోసం తీసుకు వచ్చారు. బాలుడిని పరీక్షించిన వైద్యుడు మందులు రాసి ఇవ్వగా ఇంటికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో రాత్రి సమయంలో వేదాన్స్‌కు తీవ్ర జ్వరం రాగా మరోమారు ఆసుపత్రికి తీసుకువచ్చారు. పరీక్షలు నిర్వహించిన వైద్యుడు ఆసుపత్రిలో అడ్మిట్ చేయాలని సూచించగా తల్లిదండ్రులు సమ్మతించకపోవడంతో మరోమారు మందులను ఇచ్చి పంపాడు. మంగళవారం ఉదయం వేదాన్స్ తీవ్ర అస్వస్థతకు గురికాగా బంధువులు ఆసుపత్రికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో వైద్యుడు బాలుడికి వైద్యం అందిస్తున్న సమయంలో మరింత తీవ్ర అస్వస్థతకు గురికాగా వైద్యుడు సీపీఆర్ చేసి రికవరీకి ప్రయత్నించాడు. అదే సమయంలో బాలుడు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు బంధువులకు సమాచారం అందించారు. ఆసుపత్రికి చేరుకున్న బంధువులు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ చిరంజీవి తన సిబ్బందితో అక్కడ చేరుకుని వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు అంజిరెడ్డి, మెడికల్ అధికారి ఉపెందర్‌లు ఆసుపత్రికి చేరుకొని బాలుడిని పరిశీలించి షాంపిల్స్ సేకరించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యుడు మాట్లాడుతూ తాను చేసిన వైద్యంలో ఎలాంటి పొరపాటు లేదని, బాలుడిని ఆసుపత్రిలో ఉంచాలని తల్లిదండ్రులను కోరినప్పటికీ చేర్పించలేదని తెలిపారు. చివరికి స్థానిక ఐఎంఏ సభ్యులు మృతుడి బంధువులకు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

సెస్ కార్యాలయంలో విజిలెన్స్ తనిఖీలు

- రికార్డులను స్వాధీనం చేసుకున్న అధికారులు



సిరిసిల్ల సెస్ కార్యాలయంలో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

సిరిసిల్ల రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘంలో మంగళవారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. పలు రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. సెస్‌లో జరుగుతున్న పలు అవినీతి అక్రమాలపై ఇటీవల పలువురు ఫిర్యాదులు చేసిన నేపథ్యంలో మంగళవారం హైదరాబాద్ నుంచి విజిలెన్స్ సీఐ అనిల్‌కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్, ఏఈ శ్రీకాంత్‌గౌడ్‌లు బృందాలతో సెస్ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలకు చెందిన పలు రికార్డులతో పాటు కంప్యూటర్‌లలో ఉన్న వివరాలను కాపీ చేసుకుని తీసుకెళ్లారు. దీనిపై సెస్ ఎండీని వివరణ కోరగా పలు ఫిర్యాదులకు సంబంధించి విచారణకు వచ్చి వారికి అనరమైన రికార్డులను తీసుకెళ్లారని తెలిపారు.

వీఏవోపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న వీఏవోలు

గంబీరావుపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గంబీరావుపేట మండలం ముచ్చర్ల నూతన గ్రామ సంఘం వీవోఏ విస్లావత్ పద్మపై కొందరు దాడి చేసి గాయ పర్చారని, దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవా లని స్థానిక తహసీల్దార్ మారుతిరెడ్డికి మండల వీవోఏల సంఘం మండల అధ్యక్షురాలు కురాకుల దేవలక్ష్మి మంగళవారం ఫిర్యాదు చేసింది. ప్రభు త్వం మహిళా సంఘాలకు కొనుగోలు కేంద్రాల నిర్వహణ బాధ్యతలు అప్ప గించగా, ముచ్చర్ల వరి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద బాధ్యతలు నిర్వహిస్తున్న పద్మపై ఐదుగురు దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇప్పటికే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. ఈ విషయమై ఎస్ఐ అనిల్‌కుమార్‌ను అడగా, ఫిర్యాదు ఇచ్చిన రోజే వారిపై కేసు నమో దు చేశామని తెలిపారు.

గంజాయి స్వాధీనం

ముగ్గురు యువకుల అరెస్ట్

ఎల్లారెడ్డిపేట, నవంబరు18(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం శివారులోని రాపల్లివాగు వంతెన వద్ద గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారంతో వల పన్ని ముగ్గురు యువకులను పట్టుకుని అరెస్ట్ చేశామని సీఐ శ్రీనివాస్ మంగళవారం పేర్కొన్నారు. వారి వద్ద నుంచి 150 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనపర్చుకున్నామని తెలిపారు. సీఐ శ్రీనివాస్ కథనం మేరకు.. మండల కేంద్రంతో పాటు నారాయణపూర్ గ్రామాలకు చెందిన యువకులు మంద ప్రశాంత్, గనగోని అరవింద్, బుర్క సాయిరాజులు కలిసి కరీంనగర్ జిల్లాలోని గుర్తు తెలియని వ్యక్తుల వద్ద గంజాయి కొనుగోలు చేస్తున్నారు. కొంత గంజాయిని తాగడంతో పాటు మిగిలిన దానిని మండలంలోని చుట్టు పక్కల గ్రామాలకు చెందిన యువకులు విక్రయిస్తున్నారు. మండల కేంద్రం శివారులోని రాపల్లి వాగు వంతెన వద్ద ఈ నెల 17న గంజాయి అమ్ముతున్నారనే సమాచారంతో ఎస్ఐ రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలోని పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ముగ్గురు యువకులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాయని పేర్కొన్నారు. గంజాయి విక్రయాలు, సరఫరా, తాగే వారి వివరాలను 100 నంబర్‌కు సమాచారం అందించాలని సీఐ శ్రీనివాస్ కోరారు.

భూవివాదంలో బెదిరించిన ఐదుగురిపై కేసు

కరీంనగర్ క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ గౌతమి నగర్‌కు చెందిన 944/బిలోని 270 గజాల స్థలం వివాదంలో బెదిరింపులకు పాల్పడ్డారని మానకొండూర్ మండలం చెంజర్లకు చెందిన బోళ్ల సత్యనారాయణ ఫిర్యాదుతో ఐదుగురిపై కరీంనగర్ వన్‌టౌన్‌లో సోమవారం కేసు నమోదు చేసినట్లు సీఐ రాంచందర్‌రావు తెలిపారు. భూవివాదంపై మాట్లాడుకుందామంటూ ఈ నెల 12న తనను కరీంనగర్‌లోని సీపీఐ కార్యాలయానికి పిలిపించారని, బయటకు వెళ్లకుండా అడ్డుకొని బెదిరింపులకు పాల్పడ్డారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. స్థలం నుంచి ఖాళీ చేయకుంటే తీవ్రపరిణామాలుంటాయని, కాంపౌండ్‌ను కూల్చివేస్తామని బెదిరించారని తెలిపాడు. ఈ మేరకు పంజాల శ్రీనివాస్, కొయ్యడ సృజన్‌కుమార్, న్యాలపట్ల రాజు, బండ రాజిరెడ్డి, రాజశేఖర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

సంపదను కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతున్న కేంద్రం

- సీపీఐ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

హుజూరాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దోచిపెడుతోందని సీపీఐ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. సీపీఐ వంద సంవత్సరాల ముగింపు ఉత్సవాల ప్రచార జాతా మంగళవారం హుజూరాబాద్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మావోయిస్టులు శాంతిచర్చలకు సిద్ధంగా ఉన్నామని పదేపదే చెప్పిన కూడా కేంద్ర ప్రభుత్వం ఎన్‌కౌంటర్లకు పాల్పడడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. శాంతి చర్చల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. కేంద్ర ప్రభుత్వ భద్రత విభాగాల వైఫల్యం వల్లనే కశ్మీర్, ఢిల్లీలో పేలుళ్లు జరిగాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కళావేన శంకర్, ఏఐయూఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి, నాయకులు అనిల్, నర్సింహ, రెహమాన్, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, కేదారి, బాబు, సృజన్‌కుమార్, లక్ష్మి, వెంకటేష్, అయిలయ్య, రత్నాకర్, మల్లేష్, సత్యనారాయణ, రాము, సాగర్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు

వేగవంతంగా పూర్తి చేయాలి

- హడ్కో రాష్ట్ర అధికారి జనార్దన్



మల్యాల మండలం సర్వాపూర్‌లో ఇందిరమ్మ ఇంటిని పరిశీలిస్తున్న అధికారులు

మల్యాల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని హడ్కో రాష్ట్ర అధికారి జనార్దన్ పేర్కొన్నారు. పైలట్ ప్రాజెక్ట్ ద్వారా మల్యాల మండలంలోని సర్వాపూర్‌లో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను మంగళవారం హడ్కో అధికారులు పరిశీలించారు. ఇళ్ల నిర్మాణ ప్రగతిని స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. పైలట్ ప్రాజెక్ట్ కింద ప్రారంభించిన ఇళ్ల నిర్మాణాలు అన్ని పూర్తి చేసి గ్రామాన్ని ఆదర్శంగా ఉంచాలని అధికారులకు సూచించారు. ఇళ్ల నిర్మాణాలు పెండింగ్‌లో ఉంచకుండా పూర్తి చేసేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరించాలని అన్నారు. జిల్లా హౌసింగ్ పీడీ ప్రసాద్, అధికారులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలు ప్రారంభం

- రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట : జనక్‌ప్రసాద్



స్విమ్మింగ్ పోటీలను ప్రారంభిస్తున్న జనక్‌ప్రసాద్

రామగిరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రామగిరి మండలం సెంటినరీకాలనీలోని సింగరేణి సౌజన్యంతో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలను మంగళవారం జనక్‌ప్రసాద్, గోదావరిఖని ఏసీపీ మడత రమేశ్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మినిమం వేజ్‌బోర్డు ఛైర్మన్ జనక్‌ప్రసాద్, ఏసీపీ రమేష్‌లు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తుందని అన్నారు. క్రీడలతో క్రమశిక్షణ, మంచి అలవాట్లు అలవడుతాయన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండేందుకు క్రీడలు దోహదపడతాయన్నారు. పాఠశాలలో ఆటలకు ఒక పీరియడ్‌ను ప్రభుత్వం తప్పనిసరి చేసినట్లు తెలిపారు. ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు, ఓటములను సమానంగా చూడాలన్నారు. సింగరేణి స్టేడియంలో సమాజ హితమైన పనులకు అవకాశం కల్పిస్తామన్నారు. అవసరమైన అన్ని వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ మాట్లాడుతూ మొదటి సారిగా రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీ లను పెద్దపల్లి జిల్లాలో నిర్వహించడం గర్వకారణ మని, రాబోయే రోజుల్లో మరి న్ని పోటీలను నిర్వహించే ప్రయత్నం చేస్తామన్నారు. జిల్లా యువజన క్రీడల అభివృ ద్ధి అధికారి అక్కపాక సురేష్, ప్రకాశం, రాష్ట్ర బాధ్యులు శోభారాణి, శ్రీనివాస్, పేట సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ సురేందర్, దాసరి రమేష్, టోర్నమెంట్ అబ్జర్వర్ శ్రీనివాస్, అధికారులు శశి కుమార్, శ్రీకాంత్, వ్యాయామ ఉపాధ్యాయులు శైలజ, మాధవి, జావీద్, వెంకటేష్, దుర్గాప్రసాద్, ఖాజా బీ, రేణుక, సతీష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు 52 మంది ఎంపిక

సెంటినరీకాలనీ రాణిరుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో అండర్-14 రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు వేదికైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీలకు ఉమ్మడి పది జిల్లాల నుంచి 277 మంది క్రీడాకారులు హాజరయ్యారు. తొలుత ఎంపిక పోటీలో 52 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికయ్యారు. అందులో 26 మంది బాలురు, 26 మంది బాలికలు ఉన్నారు. వీరికి సింగరేణి సిటూ టైప్ క్వార్టర్‌లను వసతి కోసం కల్పించింది. రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన క్రీడాకారులను ఈ నెల 30 ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో రాష్ట్రం తరఫున పాల్గొంటారని నిర్వాహకుడు లక్ష్మణ్ తెలిపారు.

చెరువులో బావి తవ్వకంపై విచారణ



బావి తవ్వకంపై విచారణ నిర్వహిస్తున్న అధికారులు

చందుర్తి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం తిమ్మాపూర్ గ్రామ శివారులోని కొత్త చెరువులో బావి తవ్వకంపై అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. గ్రామ శివారులోని కొత్తచెరువులో ఓ వ్యక్తి బావి తవ్వుతున్నాడని పోలీసులకు ఫిర్యాదు అందడంతో వారు పనులు నిలిపివేయించారు. మంగళవారం పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు ఆ ప్రదేశానికి వెళ్లి విచారణ చేపట్టారు. బావి తవ్వే వ్యక్తిని భూమి పట్టా సంబంధించిన పాసుబుక్‌లను తీసుకొని రావాల్సిందిగా సూచించినట్లు అధికారులు తెలిపారు. విచారణ జరిపిన వారిలో ఇరిగేషన్ ఏఈ నవీన్, ఆర్ఐ శ్రీనివాస్, ఏఎస్ఐ ఆనంద్, సర్వేయర్ చామంతి, ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్, మణికంఠ, ఇరిగేషన్ అధికారులు ఉన్నారు.

నేడు వేములవాడలో హుండీ లెక్కింపు

వేములవాడ టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో నిండిన హుండీలను బుధవారం లెక్కిస్తామని ఆలయ ఏఈఓ బ్రహ్మన్నగారి శ్రీనివాస్ తెలిపారు. ఈ హుండీలను ఆలయ ఓపెన్ స్లాబ్‌లో భారీ భద్రత మధ్య లెక్కించనున్నట్లు ఆయన తెలిపారు.

ఎస్సారెస్పీకి స్వల్పంగా వరద

జగిత్యాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో మంగళవారం నీటి మట్టం నిలకడగా ఉంది. ఎగువ ప్రాంతం నుంచి 9,338 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు నుంచి 9,338 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

పంచాయతీ ఎన్నికల నిర్ణయం ఉపసంహరించుకోవాలి

- బీసీ సాధికారిత ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నరేందర్

వేములవాడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం డిసెంబరులో పంచాయతీ ఎన్నికలను పార్టీ పరంగా రిజర్వేషన్లతో నిర్వహించేందుకు కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని బీసీ సాధికారిత ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పొలాస నరేందర్ డిమాండ్ చేశారు. వేములవాడ పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిసెంబరులో జరిగే పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లుల ఆమోదానికి రాష్ట్ర ఎంపీలు ఒత్తిడి తేవాలని, లేదా రాజీనామా చేసేందుకు సిద్ధపడాలని సూచించారు. ఈ సమావేశంలో చింతలోటి రామస్వామి, బుర్ర దశగౌడ్, హేలపతి, దేవయ్య, ఒన్నారపు దేవయ్య, గణేష్, తిరుపతి, ప్రభాకర్, రవీందర్, రాజేష్, నర్సయ్య తదితరులు ఉన్నారు.

కల్యాణ కట్ట.. సమస్యల తిష్ఠ

- పనిచేయని వేడినీళ్ల ప్లాంటు
- ఆరుబయటనే పుట్టువెంట్రుకలు
- కోడెల క్యూలైన్ పక్కనే నిర్మాణ సామగ్రి



కోడెల క్యూలైన్ పక్కనే నిర్మాణ సామగ్రి

ఇరుకైన కల్యాణకట్టలో తలనీలాలు సమర్పిస్తున్న భక్తులు

వేములవాడ టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారికి తలనీలాలు సమర్పించే కల్యాణకట్ట సమస్యలకు తిష్టగా మారింది. కార్తీక మాసం సందర్భంగా వేలాదిమంది భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. రాజన్న సన్నిధిలో రూ.150కోట్ల అభివృద్ధి పనులు కొనసాగుతున్న నేపథ్యంలో రావిచెట్టు వద్ద ఉన్న కల్యాణకట్ట-1ను చెక్‌పోస్టు వద్దకు మార్చారు. మరో కల్యాణకట్ట-2ను అమ్మవారి గెస్ట్ హౌస్ వద్ద తాత్కాలికంగా టెంట్లువేసి కొనసాగిస్తున్నారు. ఈ కల్యాణకట్టను రాజేశ్వరపురం కిందిభాగంలో ఏర్పాటు చేయాలని రూపకల్పన చేసినప్పటికీ ముందుకు సాగడంలేదు. తలనీలాల కాంట్రాక్టు ద్వారా ఆలయానికి ఏటా రూ. 15కోట్ల ఆదాయం సమకూరుతోంది. ఈ కల్యాణకట్టలో భక్తులు తలనీలాలు సమర్పించడం ఇబ్బందిగా మారింది. కల్యాణకట్టలో భక్తులకు అవసరమైన కనీస సౌకర్యాలు కరువయ్యాయి. చిన్నారులకు పుట్టువెంట్రుకలు తీసేందుకు అవసరమైన నీడ కరువైంది. కల్యాణకట్టకు ఎదురుగా ఆరుబయటనే చిన్నారులకు పుట్టు వెంట్రుకలు తీస్తున్నారు. కల్యాణకట్ట వద్ద చిన్నారులకు వేడినీళ్లు లభించక చలికి విలవిలలాడుతున్నారు. పార్వతీపురం-1 బ్లాక్ వద్ద వేడినీళ్ల ప్లాంటు ఏర్పరిచి నప్పటికీ ఉపయోగపడడం లేదు. కల్యాణకట్టకు కొంత దూరంగా ఉండడంతో బయటనే వేడినీళ్లు తెచ్చుకొని చిన్నారులకు స్నానాలు చేయిస్తున్నారు. పార్కింగ్ ప్రాంతంలో ఏర్పాటుచేసిన నల్లాల వద్దనే భక్తులు స్నానాలు చేస్తున్నారు. ఇవి దూరంగా ఉండడంతో భక్తుల స్నానాలకు ఇబ్బందులు నెలకొన్నాయి. అసౌకర్యాల మధ్య భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటున్నారు. రాజేశ్వరపురం చివరన కిందిభాగంలో భక్తుల స్నానాల కోసం ప్రత్యేక లైన్ ఏర్పరిచి నల్లాల పాయింట్ ఏర్పరిచారు. ఇప్పటివరకు ఫ్లోరింగ్ మొదలు పెట్టలేదు. భక్తుల సౌకర్యార్థం దాదాపు 120 నల్లాలను బిగించడానికి రూప కల్పన చేసినప్పటికీ కార్యరూపం దాల్చడంలేదు. సమ్మక్క, సారక్క జాతర సమీపిస్తున్న నేప థ్యంలో ఇప్పటికైనా పూర్తిసౌకర్యాలతో కల్యాణ కట్టను ఏర్పాటు చేసి భక్తుల ఇబ్బందులను తొలగించాల్సిన అవసరం ఉంది.

ధర్మగుండం మూసివేత

ఆలయ విస్తరణ పనుల నేపథ్యంలో ధర్మగుండంను మూసివేశారు. అయితే కార్తీక మాసం సందర్భంగా భక్తులు పుణ్యస్నానాలకు చోటులేదు. భీమేశ్వరస్వామి ఆలయంలో దర్శనాలు, ఆర్జిత సేవలు చేసుకునే భక్తులు పుణ్యస్నానాలు చేయాలంటే వసతిగదులే తప్ప ఎక్కడా చోటు లేదు. ఆలయ పార్కింగ్ ప్రాంతంలో ఉన్న కొద్దిపాటి నల్లాల వద్ద స్నానాలు చేయడం భక్తులకు ఇబ్బందిగా మారింది. మహిళలకు డ్రెస్సింగ్ రూంలు లేకపోవడంతో కష్టంగా మారింది.

భీమేశ్వరసదన్ ఎదుట బురదమయం

ప్రసాదాల తయారీతో వచ్చే నీటితో భీమేశ్వర సదన్ ఎదుట బురదమయంగా మారింది. భీమేశ్వరసదన్‌లోనే ఈవో, ఇంజనీరింగ్, ప్రొటోకాల్ కార్యాలయాలు ఉన్నాయి. ముఖ్య బుకింగ్‌కు పక్కన సదన్ ఎదుట బురదగా మారడంతో ఆలయానికి వచ్చే వీఐపీలు, కార్యాలయాలకు వెళ్లే అధికారులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ ప్రత్యా మ్నాయ ఏర్పాట్లు చేయాల్సి ఉంది. మరోవైపు కోడెల క్యూలైన్ పక్కనే అభివృద్ధి పనులకు ఉపయోగించే ఇసుక, కంకర ఉండడంతో భక్తులకు ఇబ్బందులు తప్పడంలేదు.



బురదగా మారిన భీమేశ్వర సదన్ ప్రధాన ద్వారం

కల్యాణకట్ట-2ను 20రోజుల్లో పూర్తిచేస్తాం

- రాజేష్, ఈఈ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం

కళ్యాణకట్ట-2ను 20రోజుల్లో పూర్తిచేస్తాం. భక్తుల స్నానాలకు దాదాపు 120 నల్లాల ద్వారా షెవర్స్‌ను ఏర్పాటు చేస్తాం. ప్రస్తుతం కళ్యాణకట్ట-1లో తలనీలాలు సమర్పించే భక్తుల సౌకర్యార్థం వెనుకభాగాన నల్లాలు ఏర్పాటు చేశాం. ఇక్కడ త్వరలో ఫ్లోరింగ్ చేసి నల్లాలు వినియోగంలోకి తీసుకువస్తాం. ఇందుకు రూ. 15లక్షలు కేటాయించాం. భీమేశ్వర ఆలయంలో రూ. 3.60కోట్ల అభివృద్ధి పనుల నేపథ్యంలో నిర్మాణానికి క్యూలైన్ పక్కన వేసిన మెటీరియల్ తొలగిస్తాం.

బద్దిపోచమ్మ సన్నిధిలో భక్తుల సందడి

- అమ్మవారికి బోనం సమర్పించేందుకు చలిలోనే క్యూ



అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు బారులు తీరిన భక్తులు

వేములవాడ టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా వేములవాడ భీమేశ్వరస్వామి దర్శనానికి వచ్చిన భక్తులతో బద్దిపోచమ్మ దేవాలయం వద్ద భక్తజన సందడి నెలకొంది. మంగళవారం వేములవాడ పట్టణంలోని బద్దిపోచమ్మ ఆలయంలో వేలాదిమంది భక్తులు అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించారు. చలిని సైతం లెక్కచేయకుండా భక్తులు తెల్లవారుజామునే క్యూ కట్టారు. వీధుల్లో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించడంతో భక్తులకు రెండు గంటల సమయం పట్టింది. బద్దిపోచమ్మ ఆలయం ఎదురుగానే నీటి గుంత ఏర్పడడంతో భక్తులు ఇబ్బందుల పాలయ్యారు.

భీమేశ్వరాలయంలో కార్తీక వైభవం

కార్తీకమాసం సందర్భంగా భీమేశ్వరాలయంలో కార్తీక వైభవం నెలకొంది. మంగళవారం భీమన్న సన్నిధిలో కార్తీక దీపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సుహాసినిలు కార్తీక దీపాలు వెలిగించి భక్తి ప్రపత్తిని చాటారు. అనంతరం సుహాసినిలకు వాయనం అందజేశారు.

బీడి కార్మికుల పిల్లల ఉపకారవేతనాలు

- ఈ నెల 30 వరకు గడువు పెంపు

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ, వెల్ఫేర్ కమిషనర్, లేబర్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు బీడి కార్మికుల పిల్లలకు ప్రోత్సాహక ఉపకారవేతనాలు దరఖాస్తులు ఈ నెల 30 వరకు పొడిగించినట్లు జిల్లా బీడీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్ తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ ప్రభుత్వ ఆమోదిత కళాశాలలు ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటీఐ, బీఎస్సీ అగ్రికల్చర్, బీటెక్, ఎంబీఏ, ఎంబీబీఎస్, ఎంసీఏ కోర్సులు చదివే విద్యార్థులకు ఈ అవకాశం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, కళాశాల యాజమాన్యాలు విద్యార్థులను ప్రోత్సహించి నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. విద్యార్థుల తల్లితండ్రులకు రూ. 1,20,000 లోపు ఆదాయం కలిగి ఉండాలని, గత సంవత్సర విద్యార్థి మార్క్స్ మెమో, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, తల్లి లేదా తండ్రి బీడీ కంపెనీ ఐడీ కార్డుతో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

కొండగట్టులో భక్తుల రద్దీ



కొండగట్టులో భక్తులు

మల్యాల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి క్షేత్రం మంగళవారం భక్తులతో పోటెత్తింది. వేలాదిగా వచ్చిన భక్తులు వేకువజాము నుంచే స్వామి వారి దర్శనంకు బారులు తీరి స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. కార్తీకమాసంతో పాటు సమ్మక్క సారలమ్మ జాతర రానున్న నేపథ్యంలో అధిక సంఖ్యలో వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, అధికారులు పర్యవేక్షించారు. అంజన్నను దర్శించకున్న భక్తులు బేతాళుడు, శ్రీరాముని ఆలయంలోనూ పూజలు జరిపారు. కాడా వైజంక్షన్, ఘాట్ రోడ్డుపై వాహనాల రాకపోకలకు అరగంట సమయం పట్టడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ధర్మపురి క్షేత్రంలో ఘనంగా గోదావరి హారతి



ధర్మపురిలో గోదావరికి హారతి ఇస్తున్న మంత్రి అడ్లూరి తదితరులు



కోటిలింగాలలో సామూహిక సత్యనారాయణ వ్రతం చేస్తున్న భక్తులు

ధర్మపురి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి 28వ రోజు మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ గోదావరి నది వద్ద హారతి పూజల్లో పాల్గొన్నారు. అత్యంత గోదావరి నది మాతకు హారతి ఇచ్చి నదిలో కార్తీక దీపం వదిలి పెట్టారు, ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, మున్సిపల్ కమిషనర్ మామిళ్ల శ్రీనివాస్‌రావు, సీఐ రాంనర్సింహారెడ్డి, ధర్మకర్తలు ఏదులాపురం మహేందర్, గుడ్ల రవీందర్, రాపర్తి సాయికిరణ్, నేదునూరి శ్రీధర్, బాదినేని వెంకటేష్, ఒజ్జల సౌజన్యానరేందర్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ ధర్మపురి వద్ద గోదావరి హారతి కార్యక్రమాన్ని నిర్వహించడం పరమ పవిత్రమని కార్యక్రమంలో పాల్గొడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. రాబోవు కాలంలో గోదావరి పుష్కరాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. గోదావరి నది వద్ద మురికి నీరు కలువకుండా సీవరేజి ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్‌టీపీ) ఏర్పాటు చేస్తామన్నారు.

కోటిలింగాలలో ప్రత్యేక పూజలు

వెల్గటూర్: కోటిలింగాల కోటేశ్వరస్వామి వారికి మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు భక్తితో కార్తీక దీపాలు వెలిగించి గోదావరి నదిలో వదిలారు. అర్చకులు నాగరాజు శర్మ, సంజీవ్ శర్మ, అన్వేష్ శర్మ, కార్తీక్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య స్వామి వారికి అభిషేకం, అర్చన, అన్నపూజ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఆచరించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కాంతారెడ్డి, ఆలయ చైర్మన్ పూదరి రమేష్, రాపాక కోటయ్య పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తున్న టిప్పర్ పట్టివేత



పోలీసులు పట్టుకున్న టిప్పర్

రుద్రంగి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) రుద్రంగి మండల కేంద్రంలో మంగళవారం ఉదయం ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న టిప్పర్‌ను పోలీసులు పట్టుకున్నారు. జగిత్యాల జిల్లా, కథలాపూర్ మండలం నుంచి రుద్రంగి మండల కేంద్రానికి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న టిప్పర్‌ను పోలీసులు పట్టుకుని చందుర్తి సర్కిల్ కార్యలయానికి తరలించారు. ఆక్రమంగా ఎవరైనా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

మానసాదేవి ఆలయంలో భక్తుల రద్దీ



మానాసాదేవి ఆలయానికి భారీగా తరలివచ్చిన భక్తులు

గన్నేరువరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాసింపేట మానసాదేవి ఆలయానికి కార్తీక మాసం చివరి మంగళవారం భక్తులు వేలాదిగా తరలివచ్చారు. భక్తులతో ఆలయ ప్రాగంణం కిక్కిరిసింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక కుంకుమ పూజలు, సత్యనారాయణ వ్రతాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కోనేటిలోని జంటనాగ శివలింగ ప్రతిమలకు జలాభిషేకం చేశారు. ఆలయ ఆవరణలో మహిళలు దీపాలను వెలిగించగంతో కార్తీక శోభను సంతరించుకుంది.

రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న అధ్యాపకులు

మల్యాల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని టి. కమలిని రాష్ట్ర స్థాయి యోగా పోటీలలో ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్ మానస, పీఈటీ మధులిక తెలిపారు. సిల్వర్ మోడల్ సాధించిన కమలినిని పాఠశాలలో అభినందించారు.

గొర్రెల పెంపకందారుల కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన కార్యవర్గం

కరీంనగర్ రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షు డిగా కరీంనగర్ రూరల్ మండలం చేగుర్తికి చెందిన బాసవేని మల్లేశం యాదవ్ ఎన్నికయ్యారు. మంగళవారం జిల్లా పశుసంవర్థక శాఖ కార్యాలయంలో జిల్లా పశు వైద్య అధికారి లింగారెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అనంతరం నూతన జిల్లా పాలక వర్గాన్ని ఎన్నుకున్నారు. డైరెక్టర్‌లుగా అగిత రవీందర్, కటిక రెడ్డి బుచ్చన్న, కాల్వ సురేష్, గడ్డి శ్రీనివాస్, చిగుర్ల శ్రీనివాస్, చౌటపల్లి రంజిత్, దాడి అంజనేయులు, దాడి సదయ్య, దానె ఓదెలు, బద్దుల రాజ్ కుమార్, ముక్కెర సదానందం ఎన్నికయ్యారు.

సింగరేణి కార్మికుడి ఆత్మహత్య

ఫైబటింక్లయిన్‌కాలనీ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రామగుండం కార్పొరేషన్ పరిధి వీర్లపల్లిలో మంగళవారం రాత్రి ఉరివేసుకుని అన్నబోయిన శ్యాంసుందర్(45) అనే సింగరేణి కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మందమర్రి ఏరియాలోని శాంతిఖని గనిలో జనరల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శ్యాంసుందర్ కొంతకాలంగా మద్యానికి బానిసై విధులకు గైర్హాజరు అవుతున్నాడు. దీంతో శ్యాంసుందర్ భార్య నాలుగు నెలల క్రితం కుమారుడిని తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి సక్రమంగా డ్యూటీలు చేయకుండా అతిగా మద్యం సేవిస్తూ ఉండేవాడు. ఈ క్రమంలో మంగళవారం వీర్లపల్లె శివారులో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



వేములవాడలో పేరిణి శివతాండవ నృత్యం

వేములవాడ టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా వేములవాడ శ్రీ భీమేశ్వర సదన్ ఆవరణలో మంగళవారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాల్లో భాగంగా కళాకారులు ప్రదర్శించిన పేరిణి శివతాండవ నృత్యం ఆకట్టుకుంది. కళాకారులు ప్రదర్శించిన ఆంధ్రనాట్యం అలరించింది. ఈ సాంస్కృతిక ప్రదర్శనల్లో ఆచార్య గురు కళాకృష్ణ ఆధ్వర్యంలో పుష్పాంజలి, దేవి స్తోత్రం, పంచలింగ స్తోత్రం , మేలప్రాప్తి, శివపంచలింగ శబ్దాలు తదితర నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రదర్శనలు తిలకించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కళాకారులు సత్కరించారు. అనంతరం కళాకారులను విప్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇవో రమాదేవి, డీఈలు రఘునందన్, మహిపాల్‌రెడ్డి, ఏఈఓ శ్రావణ్‌కుమార్, జయకుమారి, బ్రహ్మన్నగారి శ్రీనివాస్, జి. అశోక్‌కుమార్‌లు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న ఆంధ్రనాట్య ప్రదర్శన

వైభవంగా లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం





కల్యాణానికి హాజరైన భక్తులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రుద్రంగి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : రుద్రంగి మండలం మానాల గ్రామంలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణం మంగళవారం వైభవంగా జరిగింది. స్వామివారి కల్యాణానికి రాష్ట్ర యూనియన్ కోఆపరేటివ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. స్వామి వారి కళ్యాణానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరై ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు, వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణం వైభవంగా జరిపించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ చెలుకల తిరుపతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూం జలపతి, తర్రె మనోహర్ గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, జక్కు మోహన్, పిసరి చిన్నభూమయ్య ఉన్నారు.

భీమేశ్వర స్వామి ఆలయంలో భక్తులకు సౌకర్యాలు కల్పించాలి

- ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబర్ 18 (ఆంధ్రజ్యోతి) : వేములవాడకు వచ్చే భక్తులకు అన్ని వసతులు కల్పించాలని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే అదిశ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. సిరిసిల్ల సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం భక్తులకు కల్పించాల్సిన వసతులపై జిల్లా ఇన్‌చార్జీ కలెక్టర్ గరిమా అగర్వాల్, ఎస్పీ మహేష్‌బీగీతే, వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ముందుగా భీమేశ్వరస్వామి ఆలయానికి రోజుకు ఎంతమంది భక్తులు వస్తున్నారని ఏఏ మొక్కులు చెల్లించుకుంటున్నారనని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ భీమేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్యకు అనుగుణంగా ఆలయంలో వసతులు కల్పించాలని సూచించారు. క్యూలైన్‌లు, వివిధ ప్రత్యేకపూజలు, మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయం ముందు ఉన్నరావి చెట్టు వద్ద భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై చర్చించారు. ఈవో రమాదేవి, ఆర్డీవో రాధాబాయ్, ఆర్అండ్‌బీ ఈఈ నరసింహాచారీ, ఈఈ రాజేష్ పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో అధికారులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ఆలయంలో కల్యాణ వేడుకలు

జగిత్యాల టౌన్ నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) :జగిత్యాల జిల్లా కేంద్రంలోని శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయంలో మంగళవారం శ్రీ ధన లక్ష్మీ సమేత శ్రీ ధన్వంతరి స్వామి వార్ల కల్యాణ మహోత్స వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఫౌండర్, చైర్మన్ డాక్టర్ వడ్లగట్ల రాజన్న, శ్రీనివాస్ లత, మేనేజింగ్ ట్రస్టీ గట్టు రాజేందర్, భారతాల రాజసాగర్ గీత, వడ్లగట్ల శంకర్, వడ్లగట్ల గోపి స్వాతి, పెద్ది శ్రీనివాస్ మహేశ్వరి, తిరుపతి, సునిత, సాయిరాణి, రాజేష్, అర్చకులు ప్రణయ్, నరేష్, శ్రీహరి పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావన కలిగి ఉండాలి

జగిత్యాల టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక భావన కలిగి ఉండాలని బాచుపల్లి ఆశ్రమ పీఠాధిపతులు కృష్ణయ్య మహరాజ్ పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని పోచమ్మ వాడలో గలరాధాస్వామి సత్సంగ భవనంలో మంగళవారం పండిత్ ఫకీర్ చంధు 129వ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో బాచుపల్లి ఆశ్రమ ఆచార్యులు శ్రీశ్రీశ్రీ గంగా ధర్ మహరాజ్, ఆచార్యులు జయశ్రీ మాతాజీ, సత్తయ్య, అశోక్, నారాయణ, శంకరయ్య, రాజేశం, వాస్తవ రమాపతి, తౌటు రామచంద్రం పాల్గొన్నారు.

ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

జగిత్యాల అర్బన్, నవంబర్ 18 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని నూకపెల్లి అర్బన్ కాలనీలో మంగళవారం ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. నూకపెల్లి అర్బన్ కాలనీ ఏర్పాటు అయిన తర్వాత డబుల్ బెడ్‌రూం ఇళ్ళలోకి చేరిన ప్రజలు అక్కడ పోచమ్మ విగ్రహం ఏర్పాటు చేసి ఆలయం నిర్మించారు. మరో ప్రదేశంలో ఎల్లమ్మ విగ్రహాన్ని తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. అయితే ఓ దాత ఎల్లమ్మ విగ్రహాన్ని అందించడంతో మంగళవారం కాలనీ వాసులు విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ కాలనీ వాసులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

కోటిలింగాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

వెల్గటూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గోదావరి పుష్కరాలు సమీపిస్తున్న తరుణంలో కోటిలింగాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంచంద్రం గౌడ్, మాజీ ఏఎంసీ చైర్మన్ పత్తిపాక వెంకటేష్ కోరారు. మంగళవారం వెల్గటూర్‌లో బీఆర్ఎస్ పార్టీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కోటిలింగాలలో ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ అయ్యర్ పర్యటించినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి నిధులు మంజూరు చేయకపోవడం విచారకరమన్నారు. కార్యక్రమంలో జూపాక కుమార్, మూగల సత్యం, జగదీశ్వర్, సురేష్, రాజేశ్వర్ రెడ్డి, సత్తయ్య, తిరుపతి, నగేష్, సత్యం, రవి, వెంకటేష్, చంద్రయ్య, రవి, అనిల్, జనార్ధన్, రాజయ్య, లింగమూర్తి, అజిత్, హరీష్ పాల్గొన్నారు.

పంటల మార్పిడితో ప్రయోజనం

కథలాపూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రైతులు తరచూ పంటల మార్పిడి చేస్తే అధిక దిగుబడులకు ఆస్కారం ఉంటుందని వ్యవసాయాధి కారిణి యోగిత సూచించారు. మండలం లోని తక్కళ్ళపల్లిలో మంగళవారం కూర గాయల పంటలను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈఓ మౌనిక, రైతులు ఉన్నారు.

పేదలకు ఇళ్ల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం



కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

పెగడపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేదలందరికి గూడు కల్పించడమే ప్రజా ప్రభుత్వం లక్ష్యమని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. పెగడపల్లి మండలం ల్యాగలమర్రిలో ఇందిరమ్మ పథకంలో గ్రామానికి చెందిన కుందేళ్ల లక్ష్మి నూతనంగా నిర్మించుకున్న ఇంటి నిర్మాణాన్ని కలెక్టర్ బి.సత్యప్రసాద్‌తో కలసి మంత్రి లక్ష్మణ్ కుమార్ మంగళవారం సాయంత్రం ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ శాసనసభ ఎన్నికలలో హామీ ఇచ్చిన మేరకు రాష్ట్రంలో ఇళ్లు లేని పేదలందరికి ఇండ్లు మంజూరు చేయాలనే లక్ష్యంతో మండలంలోని ల్యాగలమర్రి గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టులో తీసుకుని అర్హులందరికి ఇండ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇందిరమ్మ పథకంలో నిర్మించుకున్న లబ్దిదారుల కళ్లల్లో ఆనందం చూడటానికే ల్యాగలమర్రి గ్రామానికి వచ్చి గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు. మంజూరై పనులు ప్రారంభించని ప్రతి ఒక్కరు నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు.

ఎమ్మెల్యేగా గెలిపించి మంత్రి స్థానంలో కూర్చుండబెట్టిన నియోజకవర్గ ప్రజలకు ప్రతి శని, ఆదివారాలు ధర్మపురిలోని క్యాంపు కార్యాలయంలో అందుబాటులో ఉంటానని, ఏ సమస్య ఉన్నా నేరుగా వచ్చి కలవాలని తెలిపారు. కళ్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ మంజూరులో ఎలాంటి అవకత వకలకు తావివ్వకుండా సంక్షేమ పథకాలు పేదలం దరికి అందించడమే తన ధ్యేయమన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండలంలోని వివిద గ్రామాలకు చెందిన 13 మందికి మంజూరైన కళ్యాణలక్ష్మి చెక్కులు, 53 మందికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంత్రి లక్ష్మణ్ కుమార్ లబ్ధిదారులకు అందచేశారు.

కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ బుర్ర రాములు గౌడ్, మాజీ జడ్పీటీసీ కాసుగంటి రాజేందర్ రావు, తహసీల్దార్ అనంద్ కుమార్, ఎంపీడీవో ప్రేమ్‌సాగర్‌రావు, ఎంపీవో శశికుమార్ రెడ్డి, హౌజింగ్ ఏఈ జ్యోతి, కార్యదర్శి శంకర్, నాయకులు మందపెల్లి అంజయ్య, మారం కొమురయ్య, ఒరుగల శ్రీనివాస్, కుంచె రాజేందర్, కడారి తిరుపతి, చెట్లకిషన్, అమిరిశెట్టి లక్ష్మినారాయణ, శ్యాంసుందర్ రెడ్డి, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన రాష్ట్ర పరిశీలకులు



విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న రాష్ట్ర పరిశీలకులు

ధర్మపురి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను రాష్ట్ర పరిశీలకులు, మాడల్ స్కూల్స్ అసిస్టెంట్ డైరెక్టర్ సులోచన, విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శైలజ మంగళవారం సందర్శించారు. స్పెషల్ కాంపెయిన్ 5.0 లో భాగంగా మండలంలోని ధర్మపురి ప్రభుత్వ, తిమ్మాపూర్ జిల్లా పరిషత్, తిమ్మాపూర్ ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పారిశుద్యం, రక్షణ, స్క్రాప్ తొలగింపు, మధ్యాహ్న భోజనం, కిచెన్ గార్డెలతో పాటు వివిధ పాఠశాలల రికార్డులు పరిశీలించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాలు ఏర్పరుచుకోవాలని అన్నారు. చదువును ఎప్పుడు ఆపకూడదని వారు సూచిం చారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి ఎంఈవో సీతాలక్ష్మి, జిల్లా సెక్టోరియల్ అధికారి మహేష్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎంలు పెండ్యాల మహేందర్, శ్రీనివాస్‌రావు, కళావతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

కథలాపూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఈనెల 26న పార్లమెంట్ స్ట్రీట్ జంతర్‌మంతర్ వద్ద రాజ్యాంగ హక్కుల సాధన కోసం నిర్వహిస్తున్న హలో మాల చలో ఢిల్లీ సభను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య, జిల్లా నాయకులు బత్తుల నరేశ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మంగళవారం హలో మాల చలో ఢిల్లీ సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. జాతీయ అధ్యక్షుడు అద్దంకి దయాకర్, పిల్లి సుధాకర్‌ల పిలుపు మేరకు మాల సోదరులు సభకు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ సందర్భంగా జగిత్యాల, సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు పొనగంటి రాజయ్య, నీరటి శ్రీనివాస్, బత్తుల ప్రదీప్, కోట శంకర్, ఆకుల నారాయణ, లక్ష్మీరాజం, నరేందర్ తదితరులు ఉన్నారు.

అందరూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్

కొడిమ్యాల, నవంబరు18(ఆంధ్రజ్యోతి) : అందరూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారి ప్రమోద్‌కుమార్ అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మందులను అందుబాటులో ఉంచుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారి ప్రమోద్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసారు. అనంతరం మాదక ద్రవ్యాల వినియోగం వలన కలుగు అనర్థాలపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం వైద్య సిబ్బందితో మాదక ద్రవ్యాల నిరోదక ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్, మండల మెడికల్ ఆఫీసర్లు నరేష్, పరమేశ్వరీ, డీపీవో(ఎన్‌సీడీ) రవీందర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాజశేఖర్, జిల్లా సీనియర్ అసిస్టెంట్ కుతుబుద్దీన్, సత్యప్రసాద్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

●**మెట్‌పల్లి టౌన్:** మెట్‌పల్లి పట్టణాన్ని మాదకద్రవ్య రహితంగా మార్చడానికి ప్రతిఒక్కరు ముందుకు రావాలని మున్సిపల్ కమిషనర్ మోహన్ తెలిపారు. మంగళవారం నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులతోపాటు పారిశుధ్య సిబ్బంది మున్సిపల్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ వెంకటలక్ష్మి, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

●**రాయికల్:** మాదక ద్రవ్యాల నివారణకు సమిష్టిగా కృషి చేయాలని రాయికల్ మున్సిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్ అన్నారు. రాయికల్ మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం మాదక ద్రవ్యాల నిర్మూలన ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ హరీష్, మున్సిపల్ మేనేజర్ వెంకటి, మెప్మా సీవో అర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

●**మల్యాల:** ప్రతి ఒక్కరూ తమ కుటుంబం, సమాజం కోసం మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మల్యాల ప్రాథమిక ఆసుపత్రి వైద్యురాలు మౌనిక పేర్కొన్నారు. నశా ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆసుపత్రిలో ప్రతిజ్ఞ చేశారు.

●**ఇబ్రహీంపట్నం:** మండలంలోని డబ్బా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు అల్లకట్టు సత్యనారాయణ విద్యార్థుల చేత మాదక ద్రవ్యాల నిరోదక ప్రతిజ్ఞ చేయించారు.

●**పెగడపల్లి:** మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థుల చేత మాదక ద్రవ్యాల నిరోదక ప్రతిజ్ఞ చేయిం చారు. మాదకద్రవ్యాల వినియోగం నష్టాల పట్ల అవ గాహన కల్పించారు. కార్యక్రమంలో బతికెపల్లి హెచ్ఎం వెల్మల రవీందర్‌రెడ్డి, ఆనందరెడ్డి, జరీనాబేగం, పెగడపల్లి పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు వేగవంతం చేయాలి

ఇబ్రహీంపట్నం, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులు ఇంటి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ గణేష్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గోధూర్ గ్రామంలో నిర్మాణం పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లను ఆయన సందర్శించి, పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్దిదారులు వేగంగా ఇంటి నిర్మాణాలు చేపట్టాలని కోరారు. అనంతరం వేములకుర్తి, మూలరాంపూర్ గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించి, పిచ్చిమొక్కలు లేకుండా శుభ్రంగా ఉంచాలని నిర్వాహకులకు సూచిం చారు. ఆయనవెంట టెక్నికల్ అసిస్టెంట్ వినోద్, పంచాయతీ కార్యదర్శులు హర్షద్, శ్రీకాంత్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌కు ఘన స్వాగతం

మెట్‌పల్లి టౌన్, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలో పత్తి రైతుల సమస్యలు తెలుసుకునేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మెట్‌పల్లి పట్టణంలోని పలువురు బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ఘన స్వాగతం పలికారు. మెట్‌పల్లి పాత బస్టాం డ్‌లో కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు అపూర్వ స్వాగతం పలికి సన్మా నించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కంప్యూటర్ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలి

జగిత్యాల, నవంబర్ 18 (ఆంధ్రజ్యోతి): మండల కంప్యూటర్ సెంటర్‌లలో పని చేస్తున్న తమకు ప్రతి నెలా జీతాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని జిల్లాలోని కంప్యూటర్ ఆపరేటర్లు మంగళవారం మాజీ మంత్రి జీవన్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. జిల్లా సమాఖ్యనుంచి జీతాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. దీనికి సానుకూలంగా స్పందిం చిన మాజీ మంత్రి సంబంధిత అదికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు.

'నియోజకవర్గ అభివృద్ధే ముఖ్యం'



సీసీ రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

బీర్‌పూర్,నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధి కోసం అందరితో కలిసి పనిచేస్తానని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. మంగళవారం బీర్‌పూర్ మండ లంలో పర్యటించిన ఆయన తాళ్ళధర్మారం గ్రామంలో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు సీసీ రోడ్డు నిర్మాణం కోసం 13 లక్షలు మంజూరి కాగా పనుల ప్రారంబాకి శంకుస్థాపన చేశారు. అనంతరం అదే గ్రామానికి చెందిన బర్ల రాజేశం తల్లి లచ్చవ్వ ఇటివల అనారోగ్యంతో మరనించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని తెలిపారు. బీర్‌పూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో మండలానికి చెందిన 74 మంది ఇందిరమ్మ ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు పొసిడింగ్ పత్రాలను అందించారు. సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన 16 మందికి 4లక్షల 51వేల రూపాయల విలువగల చెక్కులను లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో కేడీసీసీ జిల్లా మెంబర్ ముప్పాల రాంచందర్ రావ్, తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో భీమేష్, ఎంపీవో మధుసుదన్, ఏవో తిరుపతి, ఆర్ఐలు శ్రీనివాస్, రాహుల్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్త ముందస్తు అరెస్ట్

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ తాళ్ళధర్మారం గ్రామానికి వస్తున్నాడని తెలుసుకున్న బీఆర్ఎస్ కార్యకర్త నారపాక రవీందర్ అనే యువకుడు మెడలో బీఆర్ఎస్ కండువా వేసుకొని బస్టాండ్ వద్ద నిలుచున్నాడు. విషయం తెలుసు కున్న పోలీసులు ఎమ్మెల్యే గ్రామంలోకి రాక ముందే యువకున్ని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

చెక్కుల పంపిణీ

సారంగాపూర్: మండల కేంద్రంలో గల రైతు వేదికలో మండలానికి చెందిన 16 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్, 23 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను మంగళవారం జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వహిదోద్దిన్, ఆర్ఐ వెంకటేష్, పలువురు నాయకులు పాల్గొన్నారు.


తెగుళ్ల నివారణపై అవగాహన

కొడిమ్యాల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పూడూర్, తిర్మాలాపూర్, మండల కేంద్రంలోని రైతు వేదికలలో మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో మిరుప సాగు తెగుళ్ళ నివారణపై అవగాహన కలిగి ఉండాలని శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులను కోరారు. కార్యక్రమాలలో ఏవో జ్యోతి, మాజీ సర్పంచు రాంరెడ్డి, ఏఈవోలు పాల్గొన్నారు.

అక్రమంగా మొరం తరలిస్తే చర్యలు

మల్లాపూర్, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమ తులు లేకుండా మొరం తరలిస్తే చర్యలు తప్పవని మల్లాపూర్ తహసీల్దార్ రమేష్ హెచ్చరించారు. మంగళవారం వేంపల్లిలో అక్రమంగా మొరంను తవ్వుతున్న జేసీబీని పట్టుకొని కస్టడీ నిమిత్తం సిబ్బందిచే పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

కోనరావుపేట మీదుగా డబుల్ రోడ్డు నిర్మించాలి



అధికారికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

మెట్‌పల్లి రూరల్, నవంబర్18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోనరావుపేట గ్రామం మీదుగా డబుల్ రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని గ్రామస్థులు కోరు తున్నారు. మంగళవారం గ్రామం లోని నాయకులు జక్కని పరదాములు, ఇంద్రాల రవిల ఆధ్వర్యంలో ఆర్అండ్‌బీ అధికారు లకు వినతిపత్రం అందజేసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెట్‌పల్లి జాతీయ రహదారి నుంచి కథలపూర్ మండలం వరకు సింగిల్ రోడ్డు ఉండడం వలన చాలా ఇబ్బందులు పడుతున్నా మన్నారు. మెట్‌పల్లి మండలం లోని పెద్దగుండు జాతీయ రహదారి నుంచి కథలపూర్ మండలం వరకు సింగిల్ రోడ్డు ఉండడం వలన వావనాలు ఎదురెదురుగా వైదొలుగుతూ కొందరు అదుపుతప్పి ప్రమా దాల బారిన పడుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు తక్షణమే స్పందించి రోడ్డు విస్తరణ చేపట్టాలని వినతి పత్రం అందజేసి సమస్యలను వివరించడం జరిగిందన్నారు.

డీసీసీ పీఠం దక్కేదెవరికో..?

(ఐదో పేజీ తరువాయి)

మార్గదర్శకాల ప్రకారం డీసీసీ అధ్యక్షుడికి దరఖాస్తు చేసుకున్న వారు ఐదేళ్ల పాటు నిరంతరం క్రమశిక్షణతో పార్టీ కోసం పనిచేసిన వారై ఉండాలని అంటున్నారు. పార్టీ నుంచి ప్రజాప్రతినిధిగా ఎంపికైన వారిని డీసీసీ పీఠానికి పరిగణలోకి తీసుకోరని, పార్టీ ప్రజాప్రతినిధుల బంధువులకు సైతం అవకాశం ఉండదన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఏఐసీసీ మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకొని డీసీసీ పదవికి సమర్థవంతమైన నేతను ఎంపిక చేయడంపై పరిశీలకులు, రాష్ట్ర, జాతీయ స్థాయి నాయకత్వం దృష్టి సారించింది. ఐదేళ్లుగా పార్టీ కోసం పనిచేసిన నాయకులు చాలా మంది దరఖాస్తుదారుల్లో ఉన్నప్పటికీ ముగ్గురి పేర్లను పరిశీలకులు అధిష్ఠానానికి అందించినట్లు తెలుస్తోంది. డీసీసీ అధ్యక్ష పదవి ఎవరికి కట్టబెట్టుతారన్న చర్చ పార్టీ వర్గాల్లో జోరుగా సాగుతోంది.

ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యాన విస్తరణ అధికారి అనిల్

జగిత్యాలరూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఆయిల్‌పామ్ సాగు పై దృష్టిసారించాలని ఉద్యాన విస్తరణ అధికారి అనిల్ రైతులకు సూచించారు. మంగళవారం జగిత్యాల రూరల్ మండలంలోని గుల్లపేట గ్రామంలో ప్యాక్స్ సీఈఓ శేఖర్ ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్‌పామ్ పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా అనిల్ మాట్లాడుతూ జిల్లాకు 3750 ఎకరాల ఆయిల్‌ఫామ్‌సాగు లక్ష్యం విధించారని తెలిపారు. కార్యక్రమంలో లోహియా కంపెనీ మేనేజర్ విజయ్‌భరత్, మాజీ సర్పంచ్ జక్కుల తిరుపతి, మాజీ ఎంపీటీసీ సురేందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

●**ధర్మపురి:** ఆయిల్‌పామ్ మొక్క నాటిన మూడు ఏళ్ల నుండి దిగుబడి ప్రారంభమై 30 ఏళ్ల వరకు కొనసాగుతుందని ధర్మపురి ఉద్యానవన అధికారి అర్చన అన్నారు. ధర్మపురి మండలంలోని జైనా గ్రామంలో ఉద్యాన, వ్యవసాయ, సహకార శాఖ, లోహియా ఎడిబుల్ ఆయిల్స్ కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్ పామ్ పంటపై మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉద్యానవన విస్తరణ అధికారి వంశీకృష్ణ, మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్, వ్యవసాయ విస్తరణాధికారి ధరణి, జైనా పీఏసీఎస్ సీఈవో సాగర్‌రావు పాల్గొన్నారు.

●**రాయికల్:** ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని నియోజకవర్గ ఉద్యాన అధికారి కందుకూరి స్వాతి అన్నారు. రాయికల్ పీఏసీఎస్ కార్యాలయంలో మంగళవారం ఉద్యాన, వ్యవసాయ, సహకార శాఖ, లోహియా ఎడిబుల్ ఆయిల్స్ కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్ ఫామ్ సాగుపై అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో ముక్తేశ్వర్, ఉద్యాన విస్తరణ అధికారి రాజేష్, రాయికల్ ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ మల్లారెడ్డి, వైస్ చైర్మన్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

'మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించేలా చర్యలు చేపట్టాలి'

ధర్మపురి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జీవనోపాధి కోసం ఇరాక్ దేశానికి వెళ్లి మృతిచెందిన ధర్మపురి మండలంలోని నేరెళ్లకు చెందిన గుర్రం సురేష్ మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించేలా చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య సమత, కుటుంబ సభ్యులు సీఎం ప్రజావాణిలో మంగళవారం వినతి పత్రాన్ని అందించారు. గుర్రం సురేష్ ఉపాధి కోసం ఇరాక్ వెళ్లి పని చేస్తుండగా సెప్టెంబరు 3న ప్రమాదవశాత్తు మృతిచెందాడు. రెండు నెలలు గడుస్తుండగా మృతదేహం రాకపోవడంతో త్వరగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి

● అదనపు కలెక్టర్ రాజాగౌడ్



కస్తూర్బాలో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

మల్యాల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజాగౌడ్ అధికారులను ఆదేశించారు. కస్తూర్బా గాంధీ విద్యాలయంలో విద్యార్థులకు అందిస్తున్న బోజనం, మెనూ పరిశీలించి విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మల్యాలలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల ప్రగతిని పరిశీలించారు. లబ్దిదారులతో మాట్లాడి బిల్లులు సక్రమంగా వస్తున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వసంత, ఎంపీడీవో స్వాతి, ఎంపీవో ఆమని, మల్యాల పంచాయితీ ఈవో శ్రీకాంత్ ఇతర అధికారులు ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్ల పరిశీలన

మల్యాల వ్యవసాయ మార్కెట్ యార్డులో గల వరి ధాన్యం కొనుగోలు కేంద్రంను మంగళవారం అదనపు కలెక్టర్ బీఎస్ లత పరిశీలించారు. ధాన్యం కొనుగోల్లు, రవాణా గురించి అడిగి తెలుసుకున్నారు. తూకం వేసిన ధాన్యం వెంటనే మిల్లులకు తరలిచాలని పేర్కొన్నారు. అదనపు తూకంపై ఈ సందర్భంగా తాటిపల్లి రైతులు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. త్వరితగతిన తూకం వేసి, తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సీఈవో రుత్త శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ధర్మపురి ఎస్ఐగా మహేష్

ధర్మపురి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పోలీస్ నూతన ఎస్ఐగా గురక మహేష్ మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎస్ఐగా పని చేసిన ఉదయ్‌కుమార్ వెలగటూర్ ఎస్ఐగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నిజామాబాద్ జిల్లా భీంగల్ ఎస్ఐగా పని చేసిన మహేష్ అక్కడి నుంచి బదిలీపై వచ్చి విధుల్లో చేరారు. ఎస్ఐగా పదవీ బాధ్యతుల స్వీకరించే ముందు మహేష్ స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు.

'నియోజకవర్గ అభివృద్ధిలో ఎమ్మెల్యే విఫలం'

కోరుట్ల రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ అభివృద్ధి మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, ప్రస్తుత ఎమ్మెల్యే సంజయ్ విఫలం అయ్యాడని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు ఆరోపించారు. మంగళవారం పట్టణంలోని జువ్వాడి భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో స్థానిక నాయకులతో కలిసి జువ్వాడి కృష్ణారావు మాట్లాడారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు తిరుమల గంగాధర్, కొంతం రాజం, మహిపాల్ రెడ్డి, ముక్కెర లింబాద్రి, పోతుగంటి శంకర్, ఇంద్రాల హరీష్, కటకం చంద్ర శేఖర్, వసీం, ముజు, నహీం, అక్బర్, రవీంధర్, సత్యం, అర్వింద్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

మద్యం అమ్మకాలకు వేలం పాట

ఇబ్రహీంపట్నం, నవంబరు18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోజన్, కొత్తూరు గ్రామంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మద్యం, చికెన్ అమ్మకాలకు వేలం పాటలు నిర్వహించినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మద్యం అమ్మకానికి రూ.4.10 లక్షలతో వేలంపాట దక్కించుకోగా, చికెన్ అమ్మకాలకు రూ.40 వేల పాట పడినట్లు విశ్వసనీయ సమాచారం. గ్రామాల్లో అభివృద్ధి పేరిట గ్రామాభివృద్ధి కమిటీలు ఇష్టారాజ్యంగా వేలం పాటలు నిర్వహిస్తున్నా అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.